


# ఆరింటనొక్కటి- ఆరునొక్కటి

-కవనశర్మ

"శ్రీనివాస్‌ని పిలవండి!"

"మీకే నంబర్ కావాలి?"

"మీ నంబరెంత?"

"మా నంబరెంతైతే మీ కెందుకు మీకే నంబర్ కావాలో చెప్పండి"

"అయితే శ్రీనివాస్ నంబర్ కావాలి! "నంబర్ కలపండి"

రామారావు ఫోన్ పెట్టేశాడు. రామారావు విసుగుతో ఫోన్ పెట్టేశాక తీరుబడిగా కోపం తెచ్చుకున్నాడు.

ప్రతీవాడికి టెలిఫోన్స్ డిపార్ట్‌మెంట్ మీద ఎంత నమ్మకమో. పుసుక్కున వాళ్ళక్కావలసిన బటన్స్ నొక్కేసి వాళ్ళక్కావలసిన నంబర్ పలక్క ఛస్తుందా అన్నట్టు మాట్లాడటం మొదలుపెడ్తారు.

ఫోను పెట్టేసి కోపం నెమరేసుకొంటుంటే భార్య సీత వచ్చి.

"అన్నట్టు ఇందాక మీరు బయటికి వెళ్ళినప్పుడు మీకు ఫోను వచ్చింది" అని సమాచారం చెప్పింది.

" ఎవరు ఫోను చేసింది?"

"చెప్పలేదండి"

" ఎందుకుట ఫోను చేసింది"

"చెప్పలేదు. మీతోనే మాట్లాడాలిట వాళ్ళు"

"ఫోను నంబర్ అడిగావా?"

"అడుగుదామనుకొన్నాను. కాని మీకేగాని నాకు చెప్పనంటారేమోనని అడగలేదు మీ స్నేహితులందరికి నా దగ్గర మీ విషయాలన్నీ దాపరికమే!"

సీత చెప్పాల్సిన కబురు చెప్పే విధంలో చెప్పి వంట చెయ్యటానికి వెళ్ళిపోయింది. ఇది వందోసారి ఇటువంటి కాల్స్ రావటం. ఆ ఫోను చేసిందెవరో అని మళ్ళీ వాళ్ళు ఫోను చేసే వరకు బుర్ర బద్దలు కొట్టుకోవాలి. ఈ మాటే ఓసారి కృష్ణారెడ్డితో అంటే ఏమన్నాడు? "నీదీ ఓ కష్టమే! ఆ మధ్య మన వీథిలో ఉన్న ఒకావిడకి ఓ ఫోను వచ్చింది రాత్రి ఎనిమిదింటికి. ఫోను చేసినవాడు, 'మీ ఆయన ఊళ్ళో లేడు కదా! రాత్రి పదింటికి రానా?' అని అడిగాడుట. ఈవిడ 'మీరెవరండీ?' అని అడిగేలోపల ఫోన్ కట్టయిపోయిందట. ఆపైన ఆవిడ మళ్ళీ ఆ పెద్ద మనిషి ఫోన్ చెయ్యకపోతాడా! అని చాలాసేపు ఎదురుచూసిందట. రాత్రి పది అయినా ఫోనూ రాలేదుట. మనిషీ రాలేదుట. అప్పుడు మొదలుపెట్టి పొద్దున్న నాలుగుదాకా, పాపం, 'మీరా?, 'మీరా?' అంటూ తనను తెలిసిన వాళ్ళందరికి ఫోను చేసిందిట. ఎవరూ అవుననలేదుట. అంతకంటే అన్యాయం కాదు నీ పరిస్థితి' అన్నాడు కృష్ణారెడ్డి.

రామారావు స్నానానికి వెళ్ళాడు. మళ్ళీ ఫోను మోగింది. సీత తీసింది. ఒక ఆడగొంతుక "మీకు ధనవంతుల క్లబ్బుల్లో మెంబర్‌షిప్ ఉందా? మీరు కొత్త కారు కొన్నారా? విదేశాలు వెళ్ళి వచ్చిన స్థోమత ఉందా?... ఉంటే మీరు మాకు కావాలి" అంటూ విజృంభిస్తుంటే, మిగిలినది వినిపించుకోకుండా 'నా మొగుడికి ఫోను మీదే లైను వేస్తున్నావుటే ఎవత్తివే నువ్వు?' అంటూ సీత ఆమెను తిట్టి ఫోను పెట్టేసింది. రామారావు స్నానాలగది బయటకు వచ్చాక " ఎవత్తండీ అది? మీకు కారుందా? అని అడుగుతోంది. ఉంటే ఏమిటిట షికార్లెళ్తుందా మీతో. ఫోను అయితే మన అబ్బాయి అమెరికా నుంచి తను మాట్లాడేందుకు వీలుగా ఉంటుందని పెట్టించి వెళ్ళాడు కాని కారెవరిస్తారుట! దానికి చెప్పండి అబ్బాయి టిక్కెట్లు పంపిస్తే అమెరికా వెళ్ళొ(స్తా)మే(మో) కాని స్థోమతుండికాదని. మీ వెంట పడ్తే దానికి కాన్దబ్బు రాలదని, రాల్తే గీల్తే దాని పళ్ళు రాల్తాయనీ" అంటూ ఊదరగొట్టేసింది సీత.

రామారావు మాట్లాడకుండా ఫోను తీసి రికార్డెడ్ మెసేజ్ విన్నాడు.

'నీ మొహం! ఆ ఆరింట మనకి ఏం ఉన్నా, చేసినా, ఇన్‌కంటాక్స్ రిటర్న్ పెట్టాలని ప్రభుత్వం చేసే హెచ్చరిక అది' అంటూ భార్యకి వివరించాడు.

రామారావు పుట్టి బుద్ధెరిగాక ఐ.టి. రిటర్న్ పెట్టలేదు. అతనికంత ఆదాయమూ లేదు. అతనా రిటర్న్ పెట్టడం ఎప్పుడూ చేయలేదు కనుక అతనికి అది ఎలా చేయాలో తెలియదు. తనకు తెలిసిన వాళ్ళ నడిగాడు. వాళ్ళు టాక్స్ కన్సల్‌టెంట్‌ని కన్సల్ట్ చెయ్యమన్నారు. ఆయన మరేదో అన్నాడు. ఇన్‌కమ్ లేనివాళ్ళు ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్ పెట్టడం వివరించే వారు అతను ఎరికలో లేకపోయారు.

రామారావుకి తిక్కరేగింది "టెలిఫోనుండటం కదా దీనంతటికి కారణం" అనుకొన్నాడు. వెంటనే టెలిఫోన్ ఆఫీసుకెళ్ళి ఆ ఫోను తను సరెండర్ చేసేస్తున్నట్టు అది వెంటనే వాపసు తీసుకోవాల్సిందని చెప్పాడు. టెలిఫోనే లేకపోతే రిటర్న్ పెట్టాల్సిన అవసరం ఉండదు కదా! అని.

టెలిఫోన్ల ఆఫీసర్ భోరుమన్నాడు, "మీది ఇవాళ వచ్చిన సరెండర్ రిక్వెస్టుల్లో నూరోది. ఐ.టి. వాళ్ళు వల విసిరి నప్పటి నుంచి చూస్తే పదివేలోది. ఇన్ని ఫోన్లు వెనక్కి వచ్చేస్తే మా డిపార్ట్‌మెంట్ బతికేదెల్లా? మాకు జీతాలు వచ్చేదెల్లా? మా పిల్లల బళ్ళో జీతాలు కట్టేదెల్లా? వాళ్ళ వలలో మీరు పదరు సరికదా! మా వలలోంచి జారిపోతున్నారు" అంటూ.

అతని ఏడ్పు రోజూ జి. ఎమ్. (టెలికామ్) వింటూనే ఉన్నాడు. అతనింక కామ్‌గా ఉండలేక ఐ.టి. డిపార్ట్‌మెంట్‌కి ఫోన్ చేసాడు. "మా డిపార్ట్‌మెంట్ ఈ లెక్కన మూసెయ్యమా?" అంటూ.

"బావుందండి మేమేం చెయ్యం! జనాభాలో ఐ.టి. రిటర్న్‌లు పంపుతున్న వాళ్ళు నూటికిద్దరి కంటే లేరు. అయిదన్నా ఉండాలంది ప్రభుత్వం ఏ ఉపద్రవం వచ్చిందో ఏమోగాని పాపం దానికి" అన్నాడాయన తనది ప్రభుత్వానిది నిస్సహాయ పరిస్థితి అని తెలియజేస్తూ.

ఆపైన ఆ కమీషనర్, సెక్రటరీ, బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్‌కి ఆయన ఫైనాన్స్ మినిస్టర్‌కి ఫోను చేశారు.

"చావమంటారేమిటి? కనీసం దేశం జనాభాలో అయిదు శాతం అయినా టాక్స్ రిటర్న్లు నింపని దేశానికి ప్రపంచ బ్యాంకు అప్పివ్వనంది. మన వాళ్ళందర్ని "మేం కట్టాల్సిన టాక్స్ ఏమీ లేద'ంటూ రిటర్న్లు పెట్టమన్నాము కాని టాక్స్ కట్టమన్నామా? ప్రతీ చిన్న దానికి ఇల్లా జనం కంగారు పడ్తుంటే ఎల్లా చచ్చేది! మూడింట నొక్కటి అని పెట్టి చూసాం. అప్పుడు టాక్స్ రిటర్న్లు పెట్టిన జనాభా శాతం రెండు నుంచి అయిదు అవుతుందేమో అనుకున్నాం. కాని రెండూ పాయింట్ అయిదయింది. అందుకని ఆరింట నొక్కటి ఐడియా ట్రై చేస్తున్నాం. ఇప్పుడైనా అయిదు శాతానికి రిటర్న్లు పెరుగుతాయో లేదో! టాక్స్ వసూళ్ళలో పెరుగుదల ఉండాలని మేమేమన్నా గొంతెమ్మ కోర్కెలు కోరుతున్నామా!" అని మంత్రిగారు ప్రజలు ఆ మాత్రం అర్థం చేసుకోకపోతే ఎల్లా అన్న ధోరణిలో, బాధపడ్డారు.

మూడింట నొక్కటి స్కీమ్ ఫెయిల్ అయితే ఆరింట నొక్కటి స్కీమ్ అమలులోకి వచ్చిందని, ఇది ఫెయిల్ అయితే ఎన్నింట ఒక్కటి స్కీమ్ అమలులోకి వస్తుందో పసి కట్టడానికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యూచరాలజీ వారు ఒక రిసెర్చి టీమ్‌ని ఎంపిక చేశారని దానికి పోటీగా ' ఎస్ట్రాలజీ ఎసైన్సు' గుంపు వారు ప్లూటోను కూడా లెక్కలోకి తీసుకొని లెక్కలు కడుతున్నారని పుకార్లు పుట్టాయి. " ఈజ్ ఇట్ ఏన్ అరిథ్‌మేటిక్ ప్రోగ్రెషన్ ఆర్ జామెట్రిక్?" అని ఒక పత్రిక ప్రాచుర్యం కోసం చర్చ పెట్టింది.

మీరు సైకిల్ కొత్తగా కొన్నారా? మీ ఆవిడకీ నెలలో రెండో చీర కొన్నారా? మీ అబ్బాయి/ అమ్మాయి స్కూలు జీతం ఏడాదికి అయిదు వేలు దాటిందా? లాంటి వాటిలో ఏ ప్రశ్నలు ఇంక్లూడ్ చేస్తే ప్రభుత్వం వరల్డ్ బ్యాంక్ ఆశించిన స్థాయికి ఆర్థికంగా ఎదిగినట్టు కనిపించగలదు అన్న విషయం మీద పోటీ పెట్టి వాటి జవాబులు రూపాయి కార్డుల మీద వ్రాయమన్న షరతులు విధిస్తూ టి.వి. ఛానెల్స్ ప్రసారాలు చేశాయి. ఆ పోటీలో "మీరెప్పుడైనా ఓటు వేశారా? అయితే మన లోటు బడ్జెట్ దృష్ట్యా రిటర్న్ నింపండి'కి ప్రథమ బహుమతి లభించింది.

" ఇంతకూ నా మాటేమిటి?" అని రామారావు టెలికామ్ డిపార్ట్‌మెంట్‌ని వేధించసాగాడు.

"మీ కోర్కెను మన్నిస్తే మీతో పాటు మరో పదివేల మంది కోర్కెలను కేవలం ఈ ఒక్క డిస్ట్రిక్ట్‌లోనే మన్నించాల్సి వస్తుంది. అది దేశ ఋణ భవిష్యత్తుకి మంచిది కాదు. ఈ విషయం మీకు సవినయంగా తెలియజేస్తున్నాం. అందుచేత మీ కోర్కెకి మేము సమ్మతించలేకపోతున్నాం. అయితే మీ ఇబ్బంది గమనించి మీ బదులు మేమే ఆ రిటర్న్ ఫైల్ చేయదలిచాం. ఈసారి మీరు వచ్చినప్పుడు మా సహాయం స్వీకరించండి. సుఖపడండి, అంటూ టెలికామ్ జనరల్ మేనేజర్ చాలా కర్టియస్ సమాధానం తియ్యని అమ్మాయి గొంతుతో టెలిఫోన్‌లో పలికించాడు.

అయితే సీత దాంట్లో మొదటి వాక్యం మాత్రమే వింది. లైన్లో ఆమెను తన మొగుడు కోరిన కోర్కె ఏమిటో అర్థం కాకపోయినా ఆమె మన్నించనందుకు సంతోషించింది.

తనకి రిటర్న్ ఫైల్ చేయాల్సిన బెడద తప్పినందుకు రామారావు కూడా సంతోషించాడు.